**కామెడీ కథ**

# వంట-వడ్డాణం

**"లేటైందా అండాళొదినా...అసలైన సమయానికి లేకుండా పోతానేమోనని చాలా ఖంగారుపడి వచ్చాను" రొప్పుతూ చెప్పింది పారిజాతం.**

"ఎమర్జెన్సీ వార్డులో ఉన్నారు కదా... మామగారికసలే బాగోలేదు. ప్రాణాల కోసం పోరాడుతున్న సమయం. అందుకనే లేటైంది. ఆలస్యం అయిపోతుందని భయపడ్డాననుకో" గుండెల మీద చేతులేసుకుని చెప్పింది పారిజాతం.

"ఏం చేస్తాం, మన ప్రయత్నంలో దోషం ఉండకూడదు కదా...తర్వాత జీవితాంతం బాధపడాల్సి ఉంటుంది. ఒక్కసారి వచ్చిన ఛాన్సులు మళ్లీమళ్లీ రమ్మన్నారావు. కొన్ని పొందటానికీ కొన్ని కోల్పోక తప్పదు..మరి బాధపడకు. అయినా నువ్వు మాత్రం తగిన కారణం ఉండబట్టే కదా...ఇలాంటి సమయంలో కూడా ఇలా వచ్చావు..ఏం? నాకు మాత్రం సులభం అనుకుంటున్నావా? కష్టపడైనా సరే పిల్లలతోను, పనితోను, సతమతమవుతున్నా సాధ్యపడేలా చేసుకుంటాను." ఊరడించింది అండాళు.

"కొన్ని అవకాశాలు కోల్పోతే జీవితపర్యంతం మళ్లీ రావు. అందుకే వదినా, మనం ఈసారి ఏది ఏమైనా సరే రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసి కొత్తది ఏదైనా తయారుచేసి పంపి మన ధ్యేయం నెరవేర్చుకోవాలి" అన్నది పారిజాతం.

"సరే..త్వరగా పెట్టు. లేకపోతే టైటిల్ సాంగ్ మిస్ అవుతాం. ఆ ట్యూన్ వింటూంటేనే ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. నాకు చాలా పాకావేశం (పాకశాస్త్రం మీద పరిశోధనలు చేయాలన్న ఆవేశం) కలుగుతుంది"

టీవీ పెట్టింది అండాళు. అందులో పెట్టేటప్పటికే కార్యక్రమం ప్రారంభమైనట్టుంది. టి...టిన్...టిన్ వంటలు-వడ్డాణాలు...వాడిగా అందించు రుచికర విందు...టి....టిన్...వడ్డాణాలు ధరించు చెయ్యి కనులకి విందు...టిన్...టిన్ ఇలా సాగింది ఆ టైటిల్ సాంగ్ ఐదు నిమిషాల పాటు.

కాళ్లతో తాళం వేస్తూ, పాటని ఆస్వాదించారు వాళ్లిద్దరు. దాంతో పాటే వాళ్లు హమ్ చేస్తూ మైమరిచారు. కంచుకంఠంతో పలికిన యాంకర్ గొంతుతో ఈ లోకంలోకొచ్చారు. "వంట-వడ్డాణం కార్యక్రమానికి స్వాగతం, సుస్వాగతం. ఈ కార్యక్రమాన్ని మీకు సమర్పిస్తున్నవారు సుబ్బులు ఆకుకూరలు, వెంకయ్య కూరగాయలు, నర్సమ్మా అండ్ కో గరిటెలు, అప్పడాల కఱ్ఱలు, తపేళాలు మరియు గంగులు డబ్బాలు, గిన్నెలు, పళ్లాల మార్టు." వరసగా చెప్పింది ఆరోగ్యంగా పుష్టిగా ఉన్న ప్రోగ్రాం నిర్వాహకురాలు రుబ్బుగుండులా ఊగుతూ.

అండాళు, పారిజాతం పుస్తకం పెన్ను తీసుకుని హిప్నోటైజ్ చెయ్యబడ్డవాళ్లలా ఆమె వంక, ఆమె నగల వంక చూసుకుంటూ టీవీకి ఎదురుగా వచ్చి చతికిలబడ్డారు. అక్కడ బుల్లిబొమ్మకారు నడుపుకుంటూ ఆడుకుంటున్న అండాళు కొడుకు బాబిగాడి చేతి మీద కూర్చుంది అండాళు గబుక్కున. అంతే వాడు కుయ్యో...మొర్రో మంటూ ఏడుపు లంకించుకున్నాడు.

"అయ్యో...అసలు వినిపించటం లేదు" మొత్తుకుంటోంది అండాళు వాడిని ఊరుకోపెట్టటానికి ప్రయత్నిస్తూ. వాడి నోరు మూసి, టీవీలో శాస్త్రీ చెప్పేది వినటానికి ప్రయత్నిస్తోంది అండాళు. చివరికి వాడి ఏడుపు మాత్రం ఫుల్‌స్టాప్ పెట్టించలేకపోయింది. ఇక చేసేది లేక సినిమా హాలు తలుపు దగ్గర నిలబడి సినిమా చూసే చంటిపిల్ల తల్లిలాగ తలుపు దగ్గర నిలబడి చూడసాగింది.

"ఈ వారం మా బహుమతిని అందుకోబోతున్న వంటకాలు" (గట్టిగా చెవ్వులు చిల్లులు పడేలా వచ్చింది సస్పెన్స్‌తో కూడిన మ్యూజిక్).

"మా మొదటి విజేత... జీలకర్రల జామున్ గారు...క్షమించాలి. జీలకర్రల జమునగారు చేసిన బాదం పప్పుతో వండిన మామిడికాయ పప్పు. మా రెండవ విజేత- అటుకుల ధనియలక్ష్మిగారు...క్షమించాలి అల్లు ధనలక్ష్మిగారు చేసిన కాలీఫ్లవర్, కుంకుమ పువ్వు కలగలపు కూర. విజేతలకు మా శుభాకాంక్షలు. మనం ఇప్పుడు వీటిని వండే విధానం తెలుసుకుందాం."

ఎలాగైతేనేం బాబిగాడి నోరు చేత్తో మూసి, ఈ మాత్రం వినగలిగింది అండాళు. ఈలోపు బాబిగాడు ఆమె చేతిని కసితీరా కొరికి ఆమె చెయ్యి అడ్డుతియ్యగానే మళ్లీ తారాస్థాయిలో రాగాలాపన లంకించుకున్నాడు. ఆరున్నొక్క రాగం తప్ప ఇంకేమి వినబడటం లేదు వారిద్దరికీ.

పారిజాతం అంది నిష్ఠూరంగా "ఇలా జరుగుతుందని తెలిస్తే మా ఇంట్లోనే చూద్దును వదినా. ఎమర్జెన్సీ వార్డులో ఉన్న మా మామగారికి మామిడికాయ పప్పంటే ప్రాణం అనుకో. పత్యానికి చేసి పెడుదును గండం గట్టెక్కేక, కానీ విననిస్తేగా..." కక్షగా బాబిగాడి వైపు చూసింది.

"నరేలే వదినా...నేను మాత్రం ఇలా జరుగుతుందనుకున్నానా? కుంకుమ పువ్వు కూరైనా ఎలా వండాలో రానుకో, నేను బాబిగాడిని బయటకు తీసుకెళ్తాలే... అనసలే పసుపు, కుంకుమ, పుస్తెలు సినిమాలో అయిదవతనం వృద్ధికి ఈ కుంకుమపువ్వుకి గల సంబంధాన్ని ఎంతగానో విడమర్చి చెప్పాడు. నోములకు, వ్రతాలకు ఎంతో శ్రేష్ఠం ఆ కూర, వివరంగా రాసుకో" అని చెప్తూ బయటకు వెళ్లింది బాబిగాడిని తీసుకుని అన్యమనస్కంగా అండాళు.

* * *

ఆఫీసులో స్టాఫ్ అంతా పరమ శ్రద్ధాభక్తులతో, బుద్ధిమంతుల్లా తమ తలల్ని ఫైళ్లలోకి దూర్చుకుని మరీ పని చేస్తున్నారు. రోజూ కాలక్షేపం కోసం ఆడుకునే పచ్చీస్, దాడి, చుక్కలాటల కాయితాలు తమ ఉనికినే మరచి పనిచేస్తున్న స్టాఫ్‌ని తలుచుకుని బెంగపడుతున్నాయి. బాస్ మహాపాసురావ్ (మహేష్, ఎస్.రావ్) స్టాఫ్ డిసిప్లిన్ చూసి గర్వంగా ఫీలవుతున్నాడు. ఇదంతా తను రోజంతా ఆఫీసులో తిష్టవేయటం వల్ల వచ్చిన తేడా అని గ్రహించినట్లు గడుసుగా అందరికీ పన్లు పురమాయిస్తున్నాడు.


జనార్దనానికి అటు పక్క సీటు పంకజ్‌నిగానీ, ఇటు పక్క సీటు ఫక్రుద్దీన్‌ని గాని పలకరించకుండా పనిచేయటం వల్ల మెడ బెణికింది. అలా పని చేయటం అలవాటు లేక ఒళ్లంతా నొప్పులుగా ఉంది. మొక్కుబడిగా పని ముగించి, వంకలు వెతికే లోపే ఇంటికి జారుకున్నాడు. దారిలో బజార్లో కొట్లు కనబడగానే అండాళు జ్ఞాపకం వచ్చింది. వంట-వడ్డాణం కార్యక్రమంలో సూచించిన సరుకులు రోజూ వాడుకగా తీసుకెళ్లే షాపు వైపు చూశాడు. విరివిగా సరుకులు కొనే రెగ్యులర్ కస్టమర్ అవ్వటం వల్ల వాడికి జనార్దనం అంటే మంచి మర్యాద, నమ్మకం. ఈ కార్యక్రమం పుణ్యమాని ఈసారి జనార్దనం జీతం కాస్త మొదటి వారంలోనే ఖాళీ అయింది. అయినా కూడా షాపువాడు ఖాతా రాసుకుని మరీ సరుకులు ఇస్తున్నాడు.

షాపువాడు జనార్దనం వంక చూసి పలకరింపుగా పళ్లికిలించాడు. మళ్లీ జనార్దనం అతని వైపుకి చూసి నోరు వెడల్పుగా చేసి ప్రతిగా పళ్లికిలించాడు. జాజికాయలు, లవంగాలు, జీడిపప్పు, దాల్చినచెక్క, గసగసాలు లాంటి అత్యవసర సరుకులు ఏవైనా గుర్తుకు వస్తాయేమోనని బుర్ర, గోళ్లు అరిగిపోయేలా బుర్ర గోక్కుని మరీ ఆలోచించాడు. పప్పులు, ఉప్పులు తప్ప ఇంకేమీ తట్టలేదు. అండాళుకి ఇలాంటి సరుకులంటే ఇంట్రెస్టు తగ్గి చాలా రోజులైంది. రోజూ చేసే వంటంటే విసుగు పుడుతున్న తరుణంలో మొదలైందీ వంటల కార్యక్రమం. పైగా వంటలు చేయించటమే కాక వడ్డాణాలని ప్రైజులుగా అందించే ఈ కొత్త స్కీమ్ ఆడవాళ్లందరికీ భలేగా నచ్చింది.

ఇంటికొచ్చిన జనార్దనానికి తాళం చేతులు, చిన్న కాయితం ముక్క ఇస్తూ చెప్పింది ఇంటావిడ, "జ

ర్ధనం..మీ ఆవిడ బాబిగాడు ఏడిస్తే అలా బయటకు తీసుకెళ్లింది. ఈ సరుకులు తెచ్చి ఉంచమంది. అర్జెంటుగా అవసరమైన సరుకులు కాబోలు...''

తాళం తీసి లోపలికెళ్లిన జనార్ధనానికి కంచంలో కలిపి సహం తిన్న అల్లంముక్కలు, మిరియాలు కలిపి (కూర ముక్కలకి బదులుగా) వండిన కూర దర్శనమిచ్చింది. చూస్తేనే చెవ్వుల్లోంచి పొగలు రప్పించేటంతటి ఘాటుగా ఉన్న ఆ కూరని చూడగానే విషయం అర్థం అయింది జనార్ధనానికి.



'ఒహో పాపం! ఇది తిని బాబిగాడు ఖారం అని ఏడిస్తే, ఆండాళు చాక్లెట్లు కొనిపెట్టటానికి వెళ్లి ఉంటుంది' అనున్నాడు. సరుకుల జాబితా జ్ఞాపకం వచ్చి చూస్తే మూడే ...ల లిస్టది. 3 కిలోల బాదం పప్పు (కొట్టేసి 2 కిలోలు ...ార్చింది). ''పొదుపు నేర్చుకుంటోంది'' అనుకు...ీ కంది పప్పుకి బదులు వంటల్లోకి బాదంప...టం ఎప్పట్నించీ మొదలుపెట్టిందబ్బా కున్నాడు. పావు కిలో కుంకుమ పువ్వు, మూడు సరుకులు.

టీవీలో ప్రోగ్రాం ధర్మంవల్ల తనకి, ఆండాళుకి వంట పనిలో పోటీలు, పంతాలు తగ్గాయి. లేకపోతే చిన్న చిన్న పన్లకే బద్ధకించి ఇద్దరూ వాటాలేసుకుని, నువ్వు-నువ్వు అని పోట్లాడుకునే వారు. ఈ వంటల పోటీ పుణ్యమా, అని ఆండాళుకి వంట పనిమీద ఆసక్తి పెరిగింది. తను కూడా ఏదైనా కొత్త వంటకం కనుక్కొని నాలుగు నగలు చేజిక్కించుకోవాలన్న ఆరాటం పెరిగింది. ''ఎలాగైతేనే ఇంటి పని, గృహనిర్వహణ మీద ఆసక్తి పెరిగితే చాలు నాలుగు డబ్బులు ఖర్చయినా ఫర్వాలేదు. నా జీవితం శాంతిగా గడుస్తుంది'' అనుకున్నాడు జనార్ధనం.

షాపుకి వెళ్లి జాబితా ఇవ్వగానే కొట్టువాడు కన్నుగీటి ''పెళ్లికి వంటలా సార్, స్వీటు బాదం హల్వా అనుకుంటాను. ఏలకులు ఎంత వెయ్యమంటారో రాయలేదు? కుంకుమ పువ్వు మాత్రం మా షాపులో ఇంత లేదు, ఇంకొక రెండు మూడు షాపుల్లోంచి సేకరించవలసి ఉంటుంది. ఇంకా రెండ్రోజులు ఓపిక పట్టాల్సి ఉంటుంది'' అన్నాడు.

**లక్ష్మీమాధవ్**

సరుకుల సంచీ తీసుకుని ఇంటికొచ్చేసరికి బాబిగాడు చాక్లెట్లు తిని హుషారుగా చిరునవ్వులు చిందిస్తున్నాడు. జనార్ధనం చేతిలోని సంచి అందుకుని ఆండాళు ప్రసన్నారవిందంతో గ్లాసుడు తోటకూర జ్యూస్ తీసుకుని ఎదురొచ్చింది. ఈమధ్య ప్రసారం చేసిన కార్యక్రమంలోని మహాతల్లి ఎవరో, కాఫీకి బదులు తోటకూర జ్యూస్ ఆయువృద్ధి అని అఘోరించిందిట. కక్షని లోపలే దిగమింగుకుని నెల క్రితం తాగిన కాఫీ రుచిని నెమరేసుకుంటూ, గటగటా త్రాగేశాడు జనార్ధనం. మొహంలో ఏ వికారాలు వెలిబుచ్చకుండా నిర్లిప్తంగా, అలా తాగుతున్న జనార్ధనాన్ని ముచ్చటగా చూసింది ఆండాళు. ఇక తన మాంగల్యానికి ఒక శతాబ్దం ఢోకా లేదన్నట్లుగా ధైర్యంగా పుస్తెల్ని కళ్లకద్దుకుంది సినిమా హీరోయిన్‌ని అనుకరిస్తూ.

''దేవుడా...త్వరలో మంచి వంటకం తట్టేలా చేసి, ఆ వడ్డాణం ప్రైజు తగిలేలా చెయ్యి...నీ మేలు ఈ జన్మకి మరవను. అయిదవతనంతోను, నాలుగు నగలతోను శ్రీమహాలక్ష్మిలా కళకళలాడటం తప్ప ఏ భారతీయ స్త్రీ

అయినా ఇంకేమి కోరుకుంటుంది?'' బరువుగా అను కుంది సినిమా బాణీలో.

సంచీలో ఉన్న సరుకుల్ని బయటకు లాగాడు బాబి గాడు. పెద్దగా ఉన్న కిలో ఏలకుల పొట్లాన్ని చూసి కెవ్వు మని అరిచింది ఆండాళు. "ఇన్ని ఏలకులు నేనేమి చేసు కోను? ఏదో ఓ పది గ్రాములు తెస్తారనుకున్నాను'' అంది విస్తుపోతూ.

"ఆ విషయం లిస్టులో రాసి ఏడవచ్చుగదా...అన్నీ కేజీ లలో రాసి ఇది మాత్రం పది గ్రాములు తేవాలని నేనెలా ఊహించగలను! సరేలే..నేనింక మళ్లీ వెళ్లి వాపసు ఇవ్వ లేను. రేప్పొద్దునే ఆఫీసుకి వెళ్తూ చూస్తానులే ఆ విషయం. అసలే నా ఒళ్లంతా హూనం అయింది'' అన్నాడు అసహనంగా.

రాత్రి భోజనంలోకి చేసిన అల్లం, మిరియాల కూర కాస్తంత ఎంగిలి పడి, భార్య బాధపడుతుందని ఇక తిన లేక మిగతా కూరని పొట్లం కట్టాడు, ఆఫీసుకి వెళ్తూ పారె య్యటానికి. పైకి మాత్రం భేషుగ్గా ఉందని పొగిడాడు. ప్రారంభంలో ఇలాంటి వంటకాలు కుదరకపోవటం సహజమేనని, ఇంకో దశాబ్దంలో ఆండాళు తర్లాదలాల్ అంతటి పాకశాస్త్ర ప్రవీణురాలు కాకపోతుందేమి టిలే..అనుకున్నాడు కొండంత ఆశతో.

ఆమె గిన్నెలు ఖాళీ అవ్వటం గమనించి తృప్తిగా నిట్టూర్చింది. భోజనం చేస్తూ కొత్త వంటకాలు ఆవిష్క రణ విషయమై దీర్ఘంగా ఆలోచించసాగింది.

ఆమెకో మెరుపులాంటి ఆలోచన తట్టింది. ఏలకులతో ఏదైనా కొత్త వంటకం చేస్తే...కొత్తదనానికి ప్రాముఖ్యత నిస్తూ తప్పక వడ్డాణం బహుమతి లభిస్తుంది. వడ్డాణం ఫాషన్ కాకపోయినా బంగారం దక్కుతుంది. చెరిపించి బోల్డు నగలు చేయించుకోవచ్చు. చెరిపించే లోపు కొన్నాళ్లు జనార్ధనం జీన్స్ ప్యాంటు మీద బెల్టుగా వాడ వచ్చు అనుకుంటూ ఆలోచించింది.

ఏలక్కాయ ఉప్మా, కూర, చల్లపులుసు, బజ్జీలు ఇలా ఏలకుతో ఎనభై రకాలున్న వంటల పుస్తకం రాసేటన్ని ఆలోచనలు మెదిలాయి ఆమె మెదడులో. కానీ చివరికి అన్నిట్లలోనూ బెస్టుగా అనిపించిన ఏలకులతో పులుసు చేసే విధానాన్ని తగినన్ని ఎక్స్‌పెరిమెంట్ల తరువాత పంప టానికి నిర్ణయించుకుంది. వంటకం చేసే విధానాన్ని కను క్కునే ప్రోసెస్‌లో జనార్ధనం నాలిక వసివాడిపోయిన చివరికి ఈ గండం గడిస్తే చాలునని వెయ్యి దేవుళ్లకి మొక్కుకు న్నాడు. నిజంగానే ఆండాళు మాంగల్యబలం గొప్పది. కాబట్టే అన్ని టెస్టుల్ని విజయవంతంగా తట్టుకుని నిలబ డ్డాయి అతని నాలుక టేస్టు బడ్స్.

ఇలా రూపుదిద్దుకుంటున్న ఆండాళు వంటకం పంపించే తరుణంలో ఉండగా, ఓ రోజు అర్ధరాత్రి పరు గున వచ్చింది పారిజాతం. తను కూడా మైదా పిండి పేస్టుని మూసలో పోసి మెతుకులుగా చేసి మైదా అన్నం చేసే విధానాన్ని కనుక్కున్నానని అనౌన్స్ చేసింది.

ఇలా ఇద్దరూ పోటీకి వంటకాలు పంపి, ఉత్కంఠతో రోజూ ప్రోగ్రాం చూస్తూ ఎదురుచూసే వారు. బెండ కాయ పాయసం, దాల్చిన చెక్క బొబ్బట్లు లాంటి చాలా వంటకాలు ప్రైజులు పొందాయి. కానీ వీళ్ల వంటకం గురించిన ఆచూకీ లేదు.

* * *

ఆ రోజు పారిజాతం, ఆండాళ్లు జీవితంలో స్వర్ణాక్షరా లతో లిఖించాల్సిన రోజు. కార్యక్రమంలో యాంకర్ ఆ రోజు విజేతలు మైదా మెతుకులు చేసిన పారిజాతం, ఏల కుల పులుసు వండిన శ్రీమతి ఆండాళుగారు అని ప్రకటించింది. సంతోషం పట్టలేక ఒక్కళ్లనొ క్కళ్లు ఎత్తుకున్నారు. ఆనందం పట్టలేక హైజం ప్‌లు చేశారు. విషయం ఫోన్లు చేసి మొగుళ్లకి తెలియపరిచారు. వాళ్లు ఆఫీసుల నుంచి పోల్ వాల్ట్ చేస్తూ సరాసరి ఇళ్లకి వచ్చి వాలారు. చుట్టాలు పక్కాలు, స్నేహితులు కొత్త ఆవిష్కారా లను పొగుడుతూ అభినందనలు తెలపలేక ఉక్కిరి బిక్కిర య్యారు.



తరువాత వారంలో కొరియర్‌లో వచ్చాయి వడ్డాణాలు. పారిజాతం, ఆండాళు కలిసి ఎంత బరువుగా ఉన్నాయో నని మురిసిపోయారు. కంసాలి వద్దకు తీసుకుని వెళ్లారు వడ్డాణాలు తూపించటానికి. అప్పుడు తెలిసింది అవి కవ రింగ్‌వని, బంగారంవి కావని. ఇద్దరూ ఏడ్చి మొత్తుకుని, ఒక్కళ్లనొక్కళ్లు ఓదార్చుకుని, టీవీ వాళ్లకి కంప్లైంట్ చేస్తూ ఉత్తరాలు రాశారు. దానికి జవాబుగా వాళ్లు రాసిన లేఖ చదివి ఇద్దరూ హతాశులయ్యారు.

ప్రియ అభిమానులకు నమస్కారం,

మీరు రాసి పంపిన వంటకాలు నిజంగా మనుషులు తిని బ్రతకగలరా? మేము అలా అనుకోవటం లేదు. ఏదో మీలాంటి ప్రేక్షకుల వల్ల మా ఈ కార్యక్రమాలు రేయింపగళ్లు నిరాఘటంగా విజయవంతంగా సాగు తున్నాయన్న కృతజ్ఞతతో మేము ముందుగా ప్రకటిం చిన విధంగా వడ్డాణాలు పంపాము. మేము ఏనాడైనా వడ్డాణాలు బంగారంవని ప్రకటించామా? మీరుగా అవి బంగారంవని ఊహించుకుని ఉత్సాహపడితే దానికి మేము బాధ్యులం కాము. ఇలా వడ్డాణాలు అందు కున్న ఎంతో మంది, వాళ్ల అర్హతను వాళ్లే బేరీజు వేసు కుని, మేము పంపించిన వాటిని స్వీకరించి మాట్లాడక ఊరుకున్నారు. అయినా మా స్పాన్సర్స్ మాకు అందిం చిన బహుమతులను మేము మీకు అందజేస్తామే కానీ, మాకూ దానికీ ఏ విధమైన సంబంధం లేదు. సదా మీ సహకారాభిమానాలను ఆశిస్తూ మీ ప్రియ టీవీ ఛానల్.

దీనితో ఆండాళు, పారిజాతం కొత్త రకం వంటకాల ఆవిష్కరణకి గుడ్‌బై చెప్పి, తమ రొటీన్ వంటలనే విధి లేక కొనసాగిస్తూ కాలం గడుపుతున్నారు. పాకశాస్త్ర కూడా ఒక కళని, దాన్ని చేపట్టడానికి కూడా శ్రద్ధ, స్థ సృజనాత్మకత క్రియావిశ్లేషణ అవసరమన్న చే నిజాల్ని గ్రహించారు.

## సదా హవా

**ఎప్పుడూ సాదాసీదాగా ఉంటే ఏం బావుం టుంది. తారల్లో ఉన్న గ్లామర్ ఒకోసారి అనుకో కుండా బయటపడుతుంటుంది. జయం హీరోయిన్ సదా ఇప్పుడు మంచి గ్లామర్‌తో మెరిసిపోతోంది. లీలామహల్ సెంటర్‌లో హస్కీగా నటించిన సదా హైద్రాబాద్‌లో ఇల్లు కొనుక్కుని మరీ ఇక్కడ స్థిరపడి పోతోంది. 'మంచి హీరోయిన్ కావాలని ఉంది. పెర్ ఫార్మెన్స్ పరంగా నేనిప్పుడు చాలా హేపీగా ఉన్నాను. తాజాగా సదా 'ఔనన్నా కాదన్నా' అంటూ జనం ముందుకి రాబోతోంది.**